

# బ్రతుకు బాటలో

అరవింద

రమణి ఆ సాయంత్రం శంకర్ రాకకి ఎదురుచూస్తోంది. తను ఒంటరిగాఉండే ఆ ఆలోచనలే వస్తుంటాయి రమణికి. ఆ సాయంత్రంచల్లగాకూడా ఉంది. వాన పడవచ్చు అనిపిస్తోంది. ఆకాశంలో మబ్బులు, చల్లగాలులు చూస్తుంటే, చినుకులు ప్రారంభించకుండా అతడు ఇంటికివస్తే బాగుండు ననిపిస్తోంది.

పోనీ ఇవేళ అతడిని ఆ సంగతి అడిగితే. అసలు శంకర్‌ని ఆ విషయం అడగవచ్చా. సమాధానపడగల తెలివితేటలు తనకు లేవా!

ఇతరుల విషయంలో ఎన్ని కబురు. సలహాలు. నీతులు అయినా చెప్పవచ్చు. స్వవిషయం వస్తేనే వేటికీ లొంగదుమనసు. ఆలోచన చాలదు. అతడిని అడిగి, అతడి సమాధానం ఏమిటో తెలుసుకోవాలి.



రమణి భర్త శంకర్ ఇంకా రాలేదు. ఆ సంగతులే. తన వివాహానికి ముందర జీవితం, అతనితో తనకి వివాహమవటం ఇవన్నీ మెదడుమీద సజీవంగా తిరుగుతున్నాయి. అతడు చాలా మంచివాడు. శంకర్‌కి భార్య కావటం తన అదృష్టమే. కాని. ఆ ప్రశ్న - ఆ ప్రశ్న మనసులో ఉండి తనకి శాంతిని దూరం చేస్తోంది. తను శంకర్‌కి కోరుకున్నంత దగ్గర కాలేకపోతున్నది.

అసలు దీనికి మూలం తను టీచర్‌గా ఉద్యోగంలో ప్రవేశించగానే అరుంధతిని చూడటానికి వెళ్ళటం, అరుంధతి చాలా అమాయకంగా మనసులో ఆంతా మంచితో ఉండేది. కొన్నాళ్ళు స్కూల్లో పిల్లలందరూ గాంధీగారి శిష్యురాలని పిలిచేవారు. కానీ, తరువాత స్కూలు లీడరయి, సత్యం, అహింస, ధర్మం మొదలయిన విషయాలలో నిష్కల్మషంగా ప్రవర్తిస్తూ స్కూలు పిల్లలమధ్య చూపించే ఓర్మి, దీక్ష అవమానాలు సహితం సహించడం చూసి స్నేహితులంతా అపర గాంధీ అనేవారు. కొంతమంది యెగతాళి చేసేవారు. రోషం, ధైర్యం లేవని. అయినా సహించేది.

ఆ అరుంధతి చాలా మారి పోయిందని, తోటికోడలు, ఆడబిడ్డలతో మాటలు అనుకుని వేరే వెళ్ళిందని, కొన్ని సంగతులు విని ఆశ్చర్యపడింది రమణి. మనుషులు అట్లా మారిపోతుంటారా అనుకుంది. అరుంధతిని చూడాలనిపించింది. అరుంధతి కూడా రమ్మనే రాస్తోంది. అన్నయ్యని అడిగితే వెళ్ళమన్నాడు. దగ్గరే. మూడుగంటల రైలు ప్రయాణం. ఆదే తను ఒంటరిగా ప్రయాణం చెయ్యటం.

ఆరుంధతి స్టేషన్‌కు వచ్చింది. అరుంధతిలో ముందుగా తను గమనించిన మార్పు ఎక్కువ మాట్లాడటం. అరుంధతి ఏవో సంగతులు చెప్తూనే ఉంది. అరుంధతికి ఒక కూతురు. ఏడాది పాప.

కాఫీ త్రాగాక అరుంధతి తన మొహంలోకి చూస్తూ,

"నువ్వేమీ మారలేదే, రమణీ" అంది.

"మారాలని ఎక్కడైనా ఉందా?" అంది రమణి.

"నీకు మారాల్సిన అవసరం రాలేదు. ఊహూ. నువ్వు ఇట్లాగే ఉంటే నీకసలు పెళ్ళే కాదు." అంది నవ్వుతూ. రమణి మాట్లాడలేదు.

"మారాలి రమణీ. అసలు మారనిది ఏమిటి చైతన్యవంతమైన ఈ ప్రపంచంలో, వయసుతోబాటు ఎదుగుతాము. ఎదగటంతోబాటు మన ఆలోచనలూ ఎదగాలి, నిత్యం ప్రపంచం మారుతూనే ఉంది. కాలంతోబాటు ఆ ప్రపంచంతో మనమూ మారాలి.

"నేను చాలా మారానుతెలుసా?" అంది కప్పు టేబుల్‌మీదపెట్టి.

"విన్నాను" అంది రమణి. తనూ కప్పు టేబుల్ మీద ఉంచి.

అరుంధతి గట్టిగా గలగలా నవ్వింది.

"విన్నావా? చూడటంలేదన్నమాట. నువ్వూ మారాలే. లాభంలేదు. ఇరవైయేళ్ళనిండి, చిన్నప్పటినుంచి నన్ను చూస్తున్నావు — నాలో వచ్చిన మార్పు నీకు తెలియకపోతే - నీ అమాయకత్వం లాభం లేదే రమణీ! నాలో చాలా మార్పు వచ్చింది చెబుతా విను.

ఈ రెండేళ్ళలో నేనెప్పుడూ నమ్మని పరమ సత్యాలు అనేకం తెలుసుకున్నా రమణీ. ముందర నేనెంత మథనపడ్డానో. బాధననుభవించానో అది కేవలం అనుభవైకవేద్యం. కానీ నేను తెలుసుకున్న

పరమ సత్యం "ఆనందంగా ఉండు దానికి ప్రయత్నించు"అని. ఈ సత్యమే క్రమంగా నా బాధను తగ్గించింది. వింటున్నావా? మీరంతా నన్ను గాంధీ అని పిలిచేవారు. అంత చిన్న వయసులోనే నేను నా మనసు మీద అంత సాధన చేశాను. సాధించాను కూడా. నాకనిపించేది — ప్రపంచంలో దేనినైనాసరే, నేను నవ్వుతూ సహించగలనని. కాని, పెళ్ళి అయి, తోటికోడలు, ఆడబిడ్డలమధ్య ఉన్నప్పుడు నాకు అదృష్ట వశాత్తు ఒక పరమసత్యం బోధపడింది. ఈ సహించటమనే సాధించిన గొప్ప గుణం గృహస్థుల సాంసారిక జీవనానికి వర్తింప జేయటం అవివేకం అని. నన్ను మీరు గాంధీఅంటే, మా అత్తవారింట్లో నన్ను "అమాయకురాలు" అన్నారు. దానికి పర్యాయపదమే తెలివితక్కువదని. అది సహిస్తే అనర్థమేకాని ఎవరికీకూడా లాభం నాకు కనిపించలేదు. పైగా రమణీ! మన చుట్టూ వున్న వ్యక్తుల్ని మరింత స్వార్థ పరులుగా చెయ్యటానికి, ఎక్కువ అన్యాయాలకి అవకాశం యివ్వటానికి తోడ్పడుతుందని అర్థమయింది.

అప్పుడే ఆస్తి పంపకాలు జరిగాయి అందరం పెద్ద హాలులోనే ఉన్నాము.

"చిన్నప్పటినుంచి ఆ టేబుల్, కుర్చీ నేను వాడుకుంటున్నా"నని మరిది.

"సూయింగ్ మిషన్ నాకోసమే నాన్న కొన్నా"రని మా ఆడబిడ్డ.

"నేను పెద్ద అబ్బాయిదగ్గరే ఉంటాను కనక, ఆ డబుల్ కాట్, అద్దం అన్నీ నాతో బాటే ఉండా"లని అత్తగారు.

"అసలు ఆ బీరువాని ఎప్పుడూ నీకేరా ఇది అని ఆయనతో అంటూండేవారుట మావగారు" అని తోటికోడలు అంటుంటే నాకు వినోదంగాఉండి వింటూ నుంచున్నా.

"ఆ సోఫాసెట్ నీతో తీసుకువెడతా వేమిటిరా?" అని మా బావగారు అంటుంటే

"ఎందు కాశ్రమ. కావాలంటే అక్కడే కొనుక్కోవచ్చుగా" అంటూ మావారివైపు చూశాను. అసలే ఆయన కోపం మింగుతున్నట్లున్నారు. అదంతా నామీద ఉమ్మేసినట్లు చూశారు.

"నిన్నెవరూ కల్పించుకోమనలేదు. అవతలికి వెళ్ళు" అన్నారు. హాల్లోవాళ్ళంతా ముఖాల్లో నవ్వు దాచుకుంటున్నారు. భార్య తెలివితక్కువ తనానికి మావారు కోపం మింగుతున్నారు. మెల్లిగా హాలువిడిచి వెళ్ళిపోయాను.

"ఈ వివాహం, సంసార జీవితంవుందే, చాలా సంకుచితమైంది. పెద్దసూత్రాలు దీనికి వర్తించవు. పెద్దగుడ్డతో చిన్నమనిషికి ఆకారం కుట్టాల్సివస్తే గుడ్డ చాలా వేస్టవుతుంది.

దాంపత్యం అంటే ఇంకొక వ్యక్తి ఇష్టా ఇష్టాలు, అభిప్రాయాల ప్రసక్తికి వస్తుంది. నువ్వు నమ్మిన మార్గంలో పయనించటం సాధ్యంకాదు.

నువ్వు నీనమ్మకాలు వదులుకోవాలి, లేదా వివాహానికి సంబంధించిన ధర్మాన్ని తిరస్కరించాలి. ధర్మాన్ని తిరస్కరించటానికి సంస్కరింపబడిన మనసు ఒప్పుకోదుగా. నీ నమ్మకాలు వదులుకోవటం అనేదిత్యాగం అనే భావంద్వారా జరుగుతుంది. ఓహో! ఈ గృహిణి జీవితంలో ఆదర్శాలకి తావేది? చిత్రమేమంటే అసలు వాటిని నేను ఆదర్శాలుగా అందరానివిగాభావించలేను. పుస్తకాలు, మహాత్ములు, మేష్టర్లు కలిసి ఏకకంఠంతో బోధిస్తుంటే అది మానవ సామాన్యమనుకున్నాను కానీ, ఈ ప్రపంచంలో యిది మానవాతీతంగా ఉందని నేననుకోలేదు.

మేష్టర్ చిన్నపిల్లవాడిని దండిస్తాడు.

"అబద్ధం ఎందుకుచెప్పావురా? ఎందుకు దొంగతనం చేశావురా? సిగరెట్ ఎందుకు కాల్చావురా?" అని.

ఆ మేష్టరులో ఆ గుణాలు, బుద్ధులు అన్నీ ఉంటాయి. మరి ఎందుకా దండన. మంచివారిలాగ నటించడం నేర్చుకోమని. అంతే. ఒకవేళ ఆ పిల్లవాడు అవన్నీ నమ్మితే, అతడు వాటిని సాధించేవేళకి అతడికి ఎదురయ్యేది ఒక నిస్పృహ - ఒక వేరే ప్రపంచం. ఆ ప్రపంచంలో మంచి ఎప్పుడూ ఒక ఆదర్శమేకాని అనుభవనీయం కాదు. ఆ మంచిని సాధించినవారు ఆ ప్రపంచంలో ఉండటానికి అనర్హులు. అసమర్థులు. ప్రపంచం అతడిని అపహసిస్తుంది. అతడికి ప్రశ్న వస్తుంది - ఈ మంచిని సాధించడంలో నేను జీవితకాలం వృథా చేసుకున్నానా? ఈ ప్రపంచంలో ఆనందంగా బ్రతికే యోగ్యత నాకు లేదా? అని. లేదు.

ఒకమెట్టు కిందిగి రావాలి. మంచితనం కొంతయిపోతే అయితే మంచిది. బంగారంలో కొంత రాగి కలిస్తేకాని నగమెరుపు దిద్దుకోదు. నీలోమంచి ఉంటే ఉంచుకో, కానీ అది పూర్తిగా మంచి ముద్ద అయితే అది ఈ లోకంలో ప్రకాశించదు. మనం బ్రతికేది ఈ లోకంలోనే మరి. ఆ మంచితనానికి కొంత వివేకం. కొంత స్వార్థం. కొంత చమత్కారం చేర్చు. ఇవి మెరుగు పెడతాయేకానీ. నీ వ్యక్తిత్వానికి వన్నె తగ్గించవు.

ఆ మరునాడు మళ్ళీ మా కుటుంబం హాలులో సమావేశం అయ్యాము. మేము రెండు రోజులలో ఈ ఊరి ఉద్యోగంలో, జేరాల్సిఉన్నాము. "కొత్త ఊరు ఇంటిఅద్దె ఇచ్చుకోవటమేగాక, బియ్యంకొనుక్కోవటం వాకలి, పనిచేసేది మొదలైన ఖర్చులు వేరే ఉండనే ఉంటాయి. వస్తువుల ధరలూ అట్లాగే మండిపోతున్నాయికదా. బావగారు సోఫాసెట్ తీసికెళ్ళమన్నారు. సరే, మీ చిన్నబ్బాయికి రేడియోలేకపోతే ఒకనిమిషం తోచదుకదా. కొత్తగా గిన్నెలవీ ఏం కొనుక్కుంటాము! ఇక్కడివే ఏవోచూసి మీరే ఏర్పాటుచెయ్యండి. వాటిసంగతి కొనటం నాకంతగా తెలియదు అత్తయ్యా" అని నేనూ అందుకుని అంటుంటే వరుసగా అందరినీ చూడాలి. మావారు మొదలుకుని అంతా నన్ను చూస్తూ అట్లాఉండిపోయారు. ఆ తరవాత మా అత్తగారు ఊరగాయలు, చారుపొడితోసహా అన్నీ అమర్చి మమ్మల్ని పంపించారు. తరవాత నాగురించి చెప్పుకున్నారు.

"పైకి అట్లా ఉంటుందికానీ చాలా గడుసుది"అని. ఆ మాట విని నేను చాలా సంతోషించాను" అంది.

---

● రాము : "మరీ ఎక్కువగా నవ్వితే ఏడుపుగా మారుతుందట, నిజమేనా?"

సోము : "నిజమే."

రాము : "నీకెల్లాతెలుసు?"

సోము : "మొన్న మానాన్న అరటితొక్కమీద కాలేసి జారిపడ్డాడు, నేను నవ్వాను, ఆ తరవాత ఏడ్చాను."

అక్కడికి అరుంధతి తన కథ చెప్పుకుంది. అరుంధతి భర్తకూడా అనుకూలుడే. ఒక పాప. చక్కటి ఇల్లు. అరుంధతి సంసారం హాయిగానే ఉంది. అవును అరుంధతి మారింది. అట్లా దిద్దుకుంది తన సంసారాన్ని.

భోజనాలు అయ్యాక రాత్రి వరండాలో పక్కలు వేసుకొని పడుకున్నారు. గేటు పక్కగా ఉన్న నైట్‌క్వీన్ చెట్లనుంచి సువాసనలు వీస్తున్నాయి. లైటు ఆర్పి, ఆకాశం అందించే కాంతిలో తామిద్దరూ దగ్గరగాచేరి మాట్లాడుకున్నారు.

"ఇంకా నీ శుభలేఖ వస్తుందని నేను ఎదురుచూస్తున్నాను. నువ్వేమో పంతులమ్మవయ్యావు. మరి పెళ్ళి మాటేమిటి?" అంది అరుంధతి.

"పెళ్ళిని నేనేమీ వెనక్కి పెట్టలేదు. నా అభిప్రాయం నీకు తెలుసు" అంది తను అరుంధతి నవ్వింది.

"అందుకనే నేను అనేది నువ్వుమారాలి రమణీ అని. ఆలోచించు మీ అన్నయ్యకి అంతమంది స్నేహితులున్నారు. బంధువులున్నారు. చదువుకున్నారు. ఉద్యోగస్తులయ్యారు. అందరూ ఆదర్శభావాలు వల్లిస్తూనే ఉంటారు. నీకు మాత్రం చదువు తక్కువా. రూపంతక్కువా? కట్నం సంగతి వదిలిపెట్టు. ప్రేమ కలగాలి అంటావుకదా, ఎప్పుడైనా ఎవరినైనా ఆకర్షించడానికి ప్రయత్నం చేశావా? ఊహూ. నీ మొహమే చెబుతోంది. మగవాడిలా కబుర్లుచెప్తే, నీ ఆదర్శాలు వల్లిస్తే ఎవరూ నిన్ను ప్రేమించరు. నీ కంటి చూపులు. నీ గాజుల గలగలలూ గుండెల్ని కదలించాలి కానీ అమ్మాయ్ ఎప్పుడైనా ప్రయత్నించావా?" అంది నవ్వుతూ.

"నేనా? ఛీ అంది తను.

"అందుకేనే. నిన్నెవరూ కోరిరావటం లేదు. మరి ప్రేమ వివాహం ఎట్లాగవుతుంది. నీ మనసులో వుండే కోరికలూ, లోతులూ, వాంఛలూ ఎవరికి తెలుస్తాయి. పిలుపులై వినిపిస్తాయి నేను చెబుతున్నాను. ఒకసారి అవకాశం చూసుకొని నీ స్త్రీత్వాన్ని ప్రదర్శించు. నీకు పెళ్ళెందుకు కాదోచూస్తాను. ఒక్క చూపు చాలని చెప్పానుకదా."

"ఛీ, పోవే. చస్తే అట్లా జరగదు, తరువాత పెళ్ళి కాకపోతే."

"అహా, ఒక్కచూపుకూడా పరులెవరికీ దక్కకూడదా! అంత అకళంక పవిత్ర ప్రేమా ఆ కాబోయేవాడికోసం! అనుభవించే ఆ అదృష్టవంతుడు ఎక్కడున్నాడో" అంది అరుంధతి అపహసిస్తున్నట్లు.

రమణి అక్కడ రెండు రోజులు మాత్రమేఉండి ఇంటికివచ్చింది. వచ్చి చాలా రోజులు గడుస్తున్నాయి. కానీ అరుంధతి మాటలే ఎప్పుడూ గుర్తువచ్చేవి. ఔను. తనకెందుకు పెళ్ళికాలేదు? అన్నయ్యదీ, తనదీ ఒకటే కోరిక. కట్నంలేకుండా, మనసులు కలిసిన పెళ్ళిజరగాలి. అన్నయ్య నాలుగువేలు ఇవ్వకపోడు. కానీ అన్నయ్య ఆదర్శం అది అన్నయ్యకి ఆ విషయం అంతపట్టింపుకూడాలేదు. కానీ తనమనసులో ఆ కోర్కె బలంగాఉంది. అన్నయ్య స్నేహితుడి తమ్ముడు వాసు ప్రతి సాయంత్రం వచ్చేవాడు-తను ఇంటర్ పాసయిన వేసంగిలో. అతడికికూడా ఎం. ఎస్‌సి పూర్తయింది.

అన్నయ్య ఇంట్లో ఉన్నా లేకపోయినా వదినతో చనువుగా మాట్లాడి, తనతో గంటల తరబడి కబుర్లు చెప్పేవాడు. ఆ వాసు తనను ప్రేమిస్తాడని, అన్నయ్యతో చెప్పి పెళ్ళి చేసుకుంటాడని రెండేళ్ళు ఎదురుచూసింది. తను. ఒకరోజున అతడి పెళ్ళి శుభలేఖ వచ్చింది.

చిన్నన్నయ్య వచ్చినప్పుడు.

"ఇట్లాగయితే దీనికి పెళ్ళి అయినట్టే నాలుగో, అయిదో పడేసి పెళ్ళి చెయ్యి. అందం. చదువు ఉంటే మాత్రం? మగవాడిలాగ ధీమాగా తిరగటం, ఉద్యోగం వెలగబెట్టడం - ఎవరు చేసుకుంటారు? కాస్త ఆడపిల్లలాగ ఉండవే. రమణీ" అంటుంటాడు.

ఆడపిల్లలాగ ఉండటమేమిటి," అనుకునేది రమణి. ఔను. కొంతమంది ఆడపిల్లలు తనలాగ కాక, మాట్లాడుతూ సిగ్గుపడటం. ఓరగా చూడటం, ఏదో అనవసరంగా కల్పించుకొని మాట్లాడటం మొదలైనవి చేస్తుంటారు.

"నేను అట్లాగ చెయ్యలేను. అవన్నీ నాకు అసహ్యమే. ఎవడూ ప్రేమించకపోయినా సరే." అనుకునేది మొండిగా.

అట్లాగే ఆ ఊరికి కొత్తగా వచ్చి అన్నయ్య స్నేహితుడైన ఇంజనీర్ రామగోపాల్. తమ బంధువుగా పరిచయమైన డాక్టర్ మాధవరావ్‌కి పెళ్ళిళ్ళు అయ్యాయి. వాళ్ళ భార్యలుకూడా రమణికి స్నేహితులయ్యారు. వదిన అడిగింది - "నీకు జెలసీ లేదా రమణీ?" అని.

"నాకా? జెలసీ ఎందుకు?" అంది తను. వదిన మొహంలో ఆశ్చర్యార్థకం.

"ఆడదానివి కాదా?" అని అడుగుతున్నట్లనిపించింది.

"నువ్వు మారాలి?" అంది అరుంధతి. అంటే—

తను నటించాలి. నటించగలనా? అనుకుంటుండేది. రమణిలో తనకి పెళ్ళెందుక్కాలేదు. అనే ప్రశ్నతోబాటు ఒక కుతూహలం కూడా బయలుదేరింది.

ఒకరోజు సాయంత్రం రమణి అన్నయ్య వదినతో అంటున్నాడు:

"శంకరరావ్ అనే అతడు ఎగ్జామినర్‌గా వస్తున్నాడు. ఒకవారం అంతా మనింట్లోనే ఉంటాడు" అని. అతడు వచ్చాక—

"ఈ శంకరరావ్‌కి పెళ్ళయిందా" అని అడిగింది వదిన అన్నయ్యని.

అన్నయ్య నవ్వి "అప్పుడే నీ దృష్టి పడిందీ" అన్నాడు.

"అవును తప్పేముంది. మనిషి బాగున్నాడు. మాటతీరు. పద్ధతికూడా బాగానే కనిపిస్తున్నాయి. ఎక్కడో చుట్టరికంకూడా కలవకపోదు. ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్ళయినట్టు కనిపించలేదు" అంది రమణివైపు చూస్తూ.

---

● *రచయిత: "ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, నాలుగు నవలలు రాశాక గాని, నాకు తెలుగురాదని, నా భాష బొత్తిగా బావుండదని నాకు తెలియలేదు."*

*స్నేహితుడు: "అయినా మరి రాస్తూనే వున్నావేం?"*

*రచయిత: "ఏం చెయ్యను, అప్పటికే నాకు గొప్ప రచయితగా పేరొచ్చేసింది."*

"నేనూ ఆలోచిస్తున్నాను" అన్నాడు అన్నయ్య.

"నేను నటించాల్సిన సమయం వచ్చిందా? ఇప్పుడు నటిస్తే" అనుకుంది రమణి. ఆ ఊహ రమణిలో సాగింది. ఆ రెండు రోజులూ, అందరూ హాల్లో కాఫీ త్రాగుతూ, ఒకేసారి భోజనాలుచేసి తయారయి ఎవరి పనిమీద వాళ్ళు వెడుతుండేవారు. రమణి ఏ సంకోచం లేకుండా శంకర్‌తో మాట్లాడుతుండేది. ఆ రోజు సాయంత్రం శంకర్ రమణి కంటె ఆలస్యంగా వచ్చాడు. వదిన వంటచేస్తుంటే, కాఫీ కలిపి అతడికోసం బల్లమీద పెట్టింది.

"నటించాలి, నటించాలి" అనుకుంటోంది రమణి.

"మీరు తీసుకోరూ" అన్నాడతను, కళ్ళెత్తి.

"నేను త్రాగటం అయింది" అంది రమణి. తనలో సిగ్గు, సంకోచం ఏమీ కలగలేదు.

"ఉహూ నేను నటించలేను. సిగ్గుపడటం నాకు చేతకాదు" అనుకుంది రమణి. తరవాత కొంచెంసేపు అవీ-ఇవీ విషయాలమీద మాట్లాడుకున్నారు.

ఆ రాత్రి పడుకున్నాక

"రేపెట్లాగయినా ప్రయత్నం చెయ్యాలి. శంకర్ అందంగా ఉన్నాడు. అన్నీ నాకు నచ్చుతూనే ఉన్నాయి. ఈసారి అన్నయ్యకి 'నో' అన్న సమాధానం రాకూడదు. ఎట్లాగయినా రేపు…" అనుకుంది. ఆ మరునాడు పొద్దున్న భోజనంచేసి రమణి స్కూల్‌కి వెళ్ళటానికి తయారయి హాలులో కూర్చుంది. శంకర్ కూడా భోజనంచేసి, అతనికిచ్చిన గదిలో దుస్తులు ధరిస్తున్నాడు. పూర్తయ్యాక అతడుకూడా కాగితాలు పుస్తకాలు పట్టుకుని హాలులోకి వచ్చాడు. రమణి అతడిని పైనుంచి క్రిందదాకా చూసి చూపులు తిప్పుకుంది. ఎందుకో వస్తున్న చిరునవ్వును పెదవులమధ్య బంధించింది.

"ఏమిటలాగ చూస్తున్నారు నవ్వుకుంటున్నారు?" అన్నాడతను కొంచెం అనుమానంగా, రమణి తనను చూసి ఎందుకైనా నవ్వుతున్నదేమోనని. నిజంగా శంకర్ ఆరోజు దుస్తులలో ప్రత్యేకంగా అందంగా ఉన్నాడు. టేబుల్ దగ్గర నిలబడిన అతడిని చూస్తూ.

"మీ డ్రెస్ ఈవేళ కొత్తగా కనిపించింది. ఆ షర్ట్ చాలా బాగుంది" అంది.

"ఇదా. ఇది టెరిలిన్" అన్నాడతను సంతృప్తిగా చేయి బల్లమీద వేస్తూ.

"టెరిలినా. చాలా బాగుంది. అన్నయ్య ఎప్పుడూ వేసుకోడు ఖరీదైన బట్టలు" అని అప్రయత్నంగా చేసినట్లు రిస్టుదగ్గర స్లీవ్‌ని చేతితో పట్టుకొని చూసింది. చూస్తూ అనుకోకుండా తలయెత్తింది. పొడవుగా ఉండే శంకర్ తలవంచి తననే చూస్తున్నాడు. అతడి చూపులతో ఆమె చూపులు కలుసుకున్నాయి. రమణికి గుండెలు తీవ్రంగా కొట్టుకున్నాయి. తనలో ఏదో అలజడి రేగింది. అతడి చూపులు భరించలేననిపించింది. కుర్చీలోనించి లేచి తలవంచుకు నిలబడింది. పెదవులు సన్నగా వణుకుతున్నాయి. అతనికి దూరంగా వెళ్ళి పుస్తకాలు గుండెలమీద ఉంచుకుని కిటికీకి దగ్గరగా నిలబడింది. గుండెల తీవ్రతర స్పందనం తగ్గాక, అతనివైపయినా చూడకుండా బయటకు వెళ్ళి రిక్షా ఎక్కింది.

చూపులు కలుసుకోవటంలో అంతటి ఆకర్షణ, అలజడి వుంటాయా? ఆ క్షణాలలో తనేమైపోయింది? తనకే అర్థం





కాలేదు. మళ్ళీ తను సూటిగా అతడి ముఖం లోకి చూడగలదా. సంకోచం లేకుండా మాట్లాడగలదా! తననుగురించి అతడేమను కున్నాడో." ఎన్నో ఆలోచనలు వచ్చాయి రమణికి.

"తను నటించాలనుకుంది; కానీ నటన మరిచిపోయి పాత్రలో లీనమయిపోయింది" అనుకుని నవ్వుకుంది.

ఆ సాయంత్రం కాఫీ తాగుతూ హాలులో కూర్చుంటే, శంకర్ వచ్చి కుర్చీలో ఆసీను డయ్యాడు. రమణి గుండె దడదడలాడింది. అతడు నవ్వుతూ అన్నయ్యతో ఏదో మాట్లాడుతున్నాడు. అతడిలో ఏమీ కలవరం లేదా? కళ్ళెత్తి అతడిని చూడాలంటేనే, కనురెప్పలు బరువెక్కిపోతున్నాయి. అనుకుంది. ప్రయత్నంచేసి తలయెత్తి అన్నయ్యతో మాటలు కలుపుతూ అతడిని చూసింది. అతడు తనని చూడటంలో ఒక కుతూహలం కనిపించింది రమణికి. వెంటనే చూపులు తిప్పుకుంది.

ఆ తర్వాత అతడితో మాట్లాడుతుంటే, కళ్ళు వాల్చుకోవటం, పరధ్యానంగా మాట లనటం, తల ఒంచుకోవటం అప్రయత్నం గానే వచ్చాయి. అతడు వెళ్ళిపోతుంటే విచిత్రమైన బాధకూడా కలిగింది.

"నేను అట్లా ప్రవర్తించానేమిటి? ఆరోజు అతడి షర్ట్‌ను తాకకుండా ఉండా ల్సింది" అనుకుంది.

శంకర్ వెళ్ళిన కొద్దిరోజులకే అతడి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది రమణి జాతకం పంపమని. జాతకాలు కుదిరితే వెంటనే ముహూర్తం పెట్టుకోవచ్చునని. రమణికి, అన్నయ్యకికూడా కొంచెం ఆశ్చర్యం కలిగిందనే చెప్పాలి. శంకర్‌తో తన చెల్లెల్ని పెళ్ళిచేసుకుంటే బాగుంటుం దని మాటవరుసకు అన్నట్లుగా చెప్పాడు రమణి అన్నయ్య. శంకర్ ఆ విషయాన్ని కుతూహలంతో తీసుకుని వెంటనే ఉత్తరం వ్రాసి అంగీకారాన్ని తెలపటం ఆశ్చర్యమే గాక, ఆనందం అధికంగా కలిగించింది. రమణికి అపరిమితానందం కలిగింది. తన కోరిక నెరవేరింది. శంకర్ తనకి నచ్చిన వాడు, తనను కదిలించినవాడు. తనంటే అతనికిష్టమని తెలుస్తూనే వుంది. ఆ సంతోషంలోనే రమణి పెళ్ళి అయింది. పెళ్ళయి శంకర్‌తో సంసారం లోకి దిగాక - ఆ సంతోషానికి అలవాటు పడ్డాక ఒకరోజు రమణిమనసులో ఒకప్రశ్న వచ్చి దిగబడింది.

"శంకర్ తనతో పెళ్ళికి ఒప్పుకోటానికి కారణం ఆ సంఘటనేనా?" అని. పనిలేని తీరిక సమయంలో ఈప్రశ్న మెదడు నాక్రమించి వేధించేది. క్రమంగా ఆ ఆలో చనే యెక్కువయి, శంకర్‌కి తానెంతో దూరంగా ఉన్నట్లు, దగ్గర కాలేకపోతు న్నట్లు బాధకలిగేది. ఆ ఆలోచనలు ఆమెని వదిలిపెట్టేవి కావు.

ఆ సంఘటనే తన పెళ్ళికి కారణమా? శంకర్ చాలా మంచివాడు. ఉన్నతమైన అభిప్రాయాలు కలవాడు. అటువంటి శంకర్ తనను అంగీకరించడానికి ఆ చిన్న సంఘ టనే కారణమా? ఆనాడు తను శంకర్ షర్టు పట్టుకుని అతడి కన్నులలోకి చూసి ఉండకపోతే అతడికి తానేమీ కాదా. ఓహ్ తను తన విలువలను ఎందుకు నిలబెట్టుకో లేకపోయింది? నటించి, అతడేమి చేస్తాడో చూడాలన్న కుతూహలానికి లోబడి తన వ్యక్తిత్వాన్ని ఎందుకు కుంటుబరచుకుంది. అతడు తనను పెళ్ళి చేసుకోడానికి ఒప్పు కోవటం తనకిప్పుడు సంతృప్తి కలిగించటం లేదు. ఏనాటికైనా తనను మెచ్చే వ్యక్తి వస్తాడనీ. అతడిని పెళ్ళిచేసుకోవాలనీ తను



ఆశించింది. ఇప్పుడు దానికి భిన్నంగా జరి గింది. తననుగురించిన సత్యం తెలుసుకోలేక పోతున్నది. తనగుణం, వ్యక్తిత్వం గుర్తించే వ్యక్తి తనకి లభించడని, తనకి పెళ్ళికాదనీ భయపడిందా? ఏనాటికైనా వచ్చేవాడేమో, తను నిరీక్షించిఉంటే. తను సత్యం తెలు సుకోలేకపోతోంది - ఆ రోజు ఆవిధంగా ప్రవర్తించటంవలన తనను తను మోసగించు కున్నట్లయింది.

శంకర్ తనని పెళ్ళిచేసుకోటానికి కారణం ఆ చిన్న సంఘటనే అయితే-అత డంత దుర్బల హృదయుడా! అయితే అత డంతకుపూర్వం, ఎన్నిసార్లు ఆ బలహీన తకు లొంగిపోయాడో. ఇకముందర అతడికి అటువంటి ఆకర్షణలు కలుగవని, అతడు నిగ్రహించుకుంటాడని నమ్మకం ఏమిటి? అప్పుడు తన ప్రేమవివాహం పరిణామం ఏమయినట్లు? ఛీ-తను ఆ నిమిషాల్లో ఎంత నీచంగా, అనాలోచితంగా ప్రవర్తించింది? దానివలన తనను గురించిన సత్యం, శంకర్‌ను గురించిన సత్యం-తనకు అంద కుండా మరుగునపడి పోతున్నాయి. అతడి వ్యక్తిత్వాన్ని తను చూడ లేకపోతున్నది. ఎప్పుడూ అచంచలంగా ఉండే తను — పరికించి ఫలితం చూడాలనే కుతూహలానికి లోబడి-ఆ నిమిషాల్లో ఎందుకు చలించాలి?

మనసునిండా అశాంతి. దీనికి కారణం ఆ ఒక్క-ప్రశ్న —

శంకర్ తనను పెళ్ళిచేసుకోటాని కారణం ఆ సంఘటనేనా? అని. అదే ప్రశ్న- అశాంతి రేకెత్తించి తనను శంకర్‌కి అనుకున్నంత దగ్గరగా జేరనివ్వటంలేదు. అతడిని అడిగితే, అతడి సమాధానంవింటే. అది తనకి తృప్తినిస్తుందా! లేక తప్పు చేశానన్న వేదనే అధికమౌతుందా! ఏమైనా ఇవేళ అతడిని అడగాలి.

రమణి ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చింది — ఇన్నాళ్ళకి ఒక నిశ్చయానికి వచ్చింది! ఈనాడు. ఆకాశంలో మబ్బులు దట్టమై చినుకులు పడటం మొదలు పెట్టాయి శంకర్ ఇంటికి వచ్చాడు. రమణి ఎదురుగా వెళ్ళి.

"తడిశారా!" అని అడిగింది.

"ఇప్పుడే కదూ చినుకులు మొదలు" అన్నా డతడు. దుస్తులుమార్చుకున్నాక అత డికి రమణి కాఫీ అందించింది. కిటికీలో నుంచి వర్షాన్ని చూస్తూ మంచం మీద కూర్చున్నా డతడు.

"వాన పడుతుంటే, అందులో సంజవేళ చాలా హాయిగా ఉంటుంది కదూ" అన్నా డతను. అతడిని అడగాలి అనుకుంటోంది రమణి.

"అట్లాగున్నావేం రమణీ" అంటూ అతడు తనచేతిని రమణి భుజంమీద వేశాడు.

---

● "మా ఆవిడ కాపరానికొచ్చిన కొత్తలో పాటలు పాడేది. తర వాత్తరవాత పిల్లలు పుట్టుకురావడంతో మానేసింది."

"పిల్లలవల్ల కొన్నిసుఖాలు లేకపోలేదు మరి."

రమణి ఆ చేతిని తన రెండు చేతుల్లోకి తీసుకుంటూ ఎంతో ప్రయత్నపూర్వకంగా అంది

"మీరు నన్ను పెళ్ళి చేసుకోడానికి కారణం ఆ సంఘటనేనా !" అని.

"ఏ సంఘటన !" అన్నాడు శంకర్ రమణి ముఖంలోకి చూస్తూ.

నిజంగా అతడికి గుర్తులేదా ! పరీక్షగా అతడి కళ్ళలోకి నిజంకోసం వెతుకుతూ.

"పెళ్ళిముందర మీరు మా యింటికి వచ్చారు. హాలులో. చెరిలిన్‌షర్ట్ వేసుకున్న మీ చేతిని నేను—"

"ఎంత పెద్ద సందేహం !" అతడి నవ్వు రమణిని ఆశ్చర్యపరచింది

"అందుకని నిన్ను పెళ్ళిచేసుకున్నాననుకున్నావా ?" అడిగాడతడు.

"అనుకోవటమే కాదు, బాధపడుతున్నాను" అంది రమణి.

ఒక నిముషం ఊరుకుని అతను చెప్పాడు

"ఒకసారి నేను రైలు ఎక్కుతున్నాను. తలుపు దగ్గర చాలా రష్‌గా ఉంది. నాముందర ఒక పద్దెనిమిదేళ్ళ అమ్మాయి ఉంది. మెట్టుమీద అడుగువేసి ఆ తోపిడికి వెనక్కి తూలింది. ఆ అమ్మాయిని నా రెండు చేతుల్లోనూ పట్టుకున్నాను. రైలు ఎక్కాక, ఆ అమ్మాయి నా ఎదురుగా కూర్చుని ఉండగా నలభైమైళ్ళ ప్రయాణం చేశాము. ఆ అమ్మాయి అందమైనది. కళ్ళు అంతకంటె చక్కనివి. కానీ ఆ అమ్మాయిని నేను పెళ్ళిచేసుకోవాలనుకోలేదు. ప్రేమిస్తున్నానన్న ఊహ అసలే రాలేదు.

యూనివర్సిటీలో ఒకఅమ్మాయి ఉండేది. బాగుండేది. పాడేది బాగా చదివేది. కబుర్లు చెప్పేది. స్నేహంగా ఉండేది. రిసెర్చిచేస్తానదని కులంకూడావేరు. ఆ అమ్మాయితో స్నేహంగా ఉన్నా. పెళ్ళిచేసుకుందామని పించలేదు.

ఎన్నో అవకాశాలు ఉంటాయి.ఆలోచనలు ఆ పంథాలో సాగనిస్తే. కానీ పెళ్ళి చేసుకోటానికి ఎన్ని అనుకూల్యాలు చూసుకుంటాము మంచి కుటుంబం. మంచిపిల్ల తల్లిదండ్రులకు నచ్చటం, తనకు నచ్చటం-ఇవన్నీ ఆలోచించకుండా పెళ్ళికి సిద్ధపడతాననుకున్నావా ?

అతడు మనసారా నవ్వుతున్నాడు.

ఆ నవ్వు "ఎంత అమాయకురాలివి రమణీ" అంటున్నట్లనిపించింది రమణికి ఐనా ఆమె మనసులోకి చల్లని కాంతి పాకింది. తను అడగటమే మంచిదైంది. అతని సమాధానం తనకి నచ్చిపోయింది.

అరుంధతి అన్నట్లు తనూ మారిందన్నమాట. ఆనందంగా ఉండటం. ఆనందపరచటమే తన సిద్ధాంతం. అతడిని అడగవచ్చా కూడదా అన్న సందిగ్ధావస్థలో పడి తను శంకర్‌కు దూరంగా ఉండిపోలేదు. తను తెలివైనదో, అమాయకురాలో కానీ తనూ మారింది. అతడిని అడగటంవలన తనకి సమాధానం, తృప్తిపడటానికి ఒక ఆధారం దొరికాయి. సంశయ నివృత్తి అయితే కలిగేది ఆనందమే కదా. ఆనందంగా ఉండటం తనూ నేర్చుకుంది. తనకు ఆనందంగా ఉంటే శంకర్‌కు దూరంగా, అతడిని ఆనందపరచకుండా ఉండగలదా ?

రమణి — శంకర్ భుజాన్ని ఆనుకుంటూ అతడి ప్రక్కనే కూర్చుని తను కూడా వానలోకి చూస్తూ . "ఔను, ఎంత హాయిగా ఉందీ వాన !" అంది. □□□







# కథాసంగ్రహమ్

అసాధారణ నిర్మాత. సూత్మంల మోహనరావు తాజాచిత్రం పూర్తైపోయింది. తదుపరి చిత్రానికి కథ వెంటనే కావాల్సి వచ్చింది. నగరంలోని ప్రాచ్య, అప్రాచ్య, మ్లేచ్ఛ చిత్రాలు అన్నీ అదేపనిగా చూస్తున్నాడు కాని, తెలుగైజ్ చేయడానికి పనికొచ్చే నాన్‌తెలుగు చిత్రం యెక్కడా తగలేదు. ఒకటో అరో తగిలినా, వాటిని అప్పుడే కొందరు సాధారణ నిర్మాతలు తమ చిత్రాల్లో గుచ్చేస్తున్నారని తెల్సింది. ఇక ఈ మదరాస్ లాభంలేదనుకున్నాడు. కలకత్తాయే శరణ్యం అనుకున్నాడు. (కళ, కథ కలిసే కలకత్తా అయిందంటాడాయన) వెంటనే వెళ్ళిపోవాలని నిర్ణయించుకుని, వెంట దర్శకుడిని తీసుకెళ్దామనుకుని, ఆయన ఎందుకులే, ఆయనకి బెంగాలిరాదు. ఏమీ రాదు అనుకున్నాడు. (ఆమాటకొస్తే ఈయనకి రాదు బెంగాలీ. కానీ, నిర్మాత విశేషించి దర్శక దర్శకుడూను.) విమానంలో వెళ్తే ఎవరేనా పసిగట్టేస్తారని స్వగ్రామం వెళ్తున్నానని అందరితోనూ చెప్పి కలకత్తా మెయిల్ యెక్కి, కలకత్తాలోనే దిగాడు.

దిగీ దిగ్గానే, ఒక నవలారచయితను కలిశాడు. ఆయనతో తెలుగు ఇంగ్లీషులో మాట్లాడాడు. ఆయన ఇంగ్లీషు బెంగాలీలో మాట్లాడాడు. ఆయన మరీ ఆశకి పోయాడు. ఆయన అడిగిన మొత్తమే చేతిలోవుంటే, కానీ అరువు పెట్టకుండా బ్రహ్మాండమైన తెలుగుచిత్రం హైదరాబాదులోనే తీయొచ్చనుకున్నాడు. ఇంతఖర్చుపెట్టి ఎలాగూవచ్చాం కదా అని మహానగరంలోని వంగచిత్రాలు అతి పాతవి (శతదినోత్సవాలు అయిపోయిం తర్వాత కూడా ఆడుతున్నవి) చూశాడు. కథాసంగ్రహంకోసం పాటల పుస్తకాలు కొన్నాడు. వాటి నిర్మాతలతో మాట్లాడాడు. "మీకు ఒక్క తెలుగు ఏం లాభం ? దక్షిణ భారత భాషలన్నీ కొనుక్కోండి. కాస్త తగ్గించి యిస్తాం. మీవూరువెళ్ళి మిగతా భాషలు అమ్ముకోండి." అన్నారు. ఇతనెంతబతిమాలినా వాళ్ళేం కొరకబడలేదు. అంచేత వాళ్ళని అలాగే ఒదిలేసి బయటికి వచ్చేశాడు. వచ్చిం తర్వాత ఏం చెయ్యడానికి తోచలేదు. తోచడంకోసం ఆయన అప్పుడప్పుడు నడవడం కద్దు. అలాంటి పాదయాత్రలోనే ఓనుదినాన వాళ్ళ స్వగ్రామంలో కల్గిన ఒక ఆలోచన ఫలితమే ఈనాటికి ఆయన తీయగల్గిన ద్వాదశ చిత్రమాల.

నడుస్తూన్నవాడల్లా అమాంతం ఆగిపోయాడు.ఎదురుగాపోతున్న బెంగాలీఅమ్మాయిల గుంపును చూసి. "వీళ్ళలోఒక్కరైనా తెలుగుమాట్లాడగలిగితేఎంతబావుణ్ను! హీరోయిన్ ఛాన్స్ యిచ్చేద్దునుకదా !" అనుకుని అంతలోనే మళ్ళీ—" ఆ....వాళ్ళు మద్రాసెక్కడొస్తారు!" అనుకుంటూపోతున్నాడు. అమ్మాయిలు అలాదూరంగావెళ్ళి పోయారు. ఉన్నట్టుండి, ఎందుకు నడుస్తున్నాడో జ్ఞాపకం రాలేదు. బుర్ర గోక్కున్నాడు. అయినా జ్ఞాపకం రాలేదు. మర్చిపోయినవి జ్ఞాపకం చేసుకుందుకు చుట్టకాల్చడం ఆయనకి చిన్నప్పట్నించీ అలవాటు. అందుకే ఎప్పుడూ ఆయన జుబ్బా కుడి జేబులో సిద్ధంగా వుంటాయి. ప్రశస్తమైన